


జర్నలిస్టుల హక్కుల
2
# సాధనకే జిల్లా మహాసభ !
భారీ ఎత్తున నిర్వహణకు కమిటీల ఏర్పాటు



www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం | 03 | జూలై | 2026 | పేజీలు: 08

# రైతులకు చేరువలో పత్తి విత్తనాలు



### పారదర్శకంగా సర్ ప్రక్షాళన
### కలెక్టర్ చంద్ర శేఖర్

**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** కపస్ కాంతి పథకంలో భాగంగా పంపిణీ చేస్తున్న పత్తి విత్తనాలను జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. గురువారం అయన నల్గొండ జిల్లా, కట్టంగూరు రైతు వేదికలో ఏర్పాటుచేసిన పత్తి విత్తనాల ప్రదర్శన పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ..మిగతా 2లో



# అక్రమాలకు తావివ్వొద్దు

### యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి



**చేర్యాల, అక్షిత ప్రతినిధి:** సిద్ధిపేట జిల్లాలో యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు. ఇటీవల చేర్యాల మండలం లో శ్రీసాయి శివ ఫెర్టిలైజర్ సేల్స్ షాప్ లో యూరియా సరఫరా లో కొంత అక్రమాలు జరిగినట్టు మా దృష్టికి రావడం జరిగిందని, వెంటనే జిల్లా వ్యవసాయ అధికారి ద్వారా ఎంక్వయిరీ చేసినప్పుడు ప్రాథమిక ఎంక్వయిరీ రిపోర్టులో శ్రీ సాయి శివ ఫెర్టిలైజర్ సేల్స్ షాప్ అతను సందీప్ రెడ్డి ఈ పాస్ మిషన్ ద్వారా హోల్సేల్ డీలర్స్ నుంచి ..మిగతా 2లో





మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం భవనాన్ని తెలంగాణ హైకోర్టు, మహబూబ్‌నగర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి న్యాయమూర్తి ఎన్.వి. శ్రావన్ కుమార్, హైదరాబాద్ నుండి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి తో కలిసి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానికంగా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం. ప్రేమలత, దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి, రిబ్బన్ కట్ చేసి న్యాయస్థానం భవనాని ప్రారంభించారు.

# సమయ పాలన సత్వర న్యాయం

### దేవరకద్రలో జూనియర్ సివిల్ జడ్జి-కమ్- జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం భవనం వర్చువల్‌గా ప్రారంభం



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ :** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ ..మిగతా 2లో



## వరద కాలువనే మింగేస్తున్న
# అక్రమ నిర్మాణాలు!

### కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే నిబంధనలకు తూట్లు
### ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?
### ఫిర్యాదులు, వార్తలు వచ్చినా చర్యలు శూన్యం

**సంగారెడ్డి, అక్షిత బ్యూరో :** సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే వరద కాలువను ఆక్రమించి బహుళ అంతస్తుల భవనం నిర్మాణం సాగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇరిగేషన్, మున్సిపల్ టౌన్ ..మిగతా 2లో



www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## సమయ పాలన సత్వర న్యాయం

మొదటి పేజీ తరువాయి...

న్యాయస్థానం భవనాన్ని తెలంగాణ హైకోర్టు, మహబూబ్‌నగర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి న్యాయమూర్తి ఎన్.వి. శ్రావన్ కుమార్, హైదరాబాద్ నుండి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి తో కలిసి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానికంగా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం. ప్రేమలత, దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి, రిబ్బన్ కట్ చేసి న్యాయస్థానం భవనాని ప్రారంభించారు. కొత్త న్యాయస్థానం ప్రారంభం ద్వారా దేవరకద్ర మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ అవుతాయని, కేసుల విచారణ వేగవంతం కావడంతో పాటు ప్రజలకు సమయపాలనతో కూడిన న్యాయ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్.పి. డి. జానకి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి (డి.ఎల్.ఎస్.ఎ) ఇందిర, ఇతర అధికారులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమాలకు తావివ్వొద్దు

మొదటి పేజీ తరువాయి...

6429 బ్యాగుల యూరియాని తీసుకొని దానిని కన్ఫర్మేషన్ చేయకుండా అక్రమంగా ఇతనే రైతుల పేర్లను రైతుల ఆధార్ కార్డు ఆధారంగా తీసుకొని సేల్ చేసినట్టు చూపించి అక్రమాలకు పాల్పడినట్టు తెలిసిందని అన్నారు. ఈ విధంగా యూరియాను మిస్ యు చేశారు. కావున ఇతనిపై వెంటనే ఎంక్వయిరీ చేసి పోలీస్ కేసు నమోదు చేయడంతో వెంటనే అతన్ని పోలీసులు అరెస్టు చేయడమే కాకుండా, అతని లైసెన్సును కూడా వ్యవసాయ శాఖ రద్దు చేశారని తెలిపారు. యూరియా డైవర్షన్ అక్రమాలు జరుగుతున్న చేర్యాల మండల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర్ స్వామి సరిగా పర్యవేక్షణ చేయకపోవడం మూలంగా వెంటనే అతని విధుల్లో నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ యూరియా మిస్ యూస్ సంఘటనలో ప్రమేయం ఉన్న ఇతరుల గురించి కూడా ఎంక్వయిరీ చేస్తున్నామని, వారిని గుర్తించిన తర్వాత వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వరద కాలువనే మింగేస్తున్న అక్రమ నిర్మాణాలు!

మొదటి పేజీ తరువాయి...

ప్లానింగ్ శాఖలకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, పత్రికల్లో వార్తలు వెలువడినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. మురళీకృష్ణ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి కమాన్ సమీపంలోని వరద కాలువ గుండా బైపాస్ రోడ్డులో ఉన్న తదితర కాలనీల వర్షపు నీరు, సిఎస్ఐ చర్చి పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహం చివరకు ఎర్రకుంటలో కలుస్తుంది. అలాంటి కీలక వరద కాలువను ఆనుకుని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలను పూర్తిగా విస్మరించి బహుళ అంతస్తుల భవన నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. స్థానికుల ఆరోపణల ప్రకారం, నిర్మాణదారులు కాలువపై సీసీ స్లాబ్ వేసి నిర్మాణాన్ని విస్తరించారు. భవిష్యత్తులో వరద నీరు భవనంలోకి రాకుండా ముందస్తు జాగ్రత్తగా కాలువ స్వరూపాన్నే మార్చే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు మాత్రం నోరు మెదపకపోవడం చర్చనీయాంశంగా మారింది. అన్ని అనుమతులు మాకు ఉన్నాయి అంటూ నిర్మాణదారులు బహిరంగంగానే చెబుతున్నప్పటికీ, నిజంగా ఇరిగేషన్, మున్సిపల్ శాఖలు ఎలాంటి అనుమతులు ఇచ్చాయో ప్రజలకు వెల్లడించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరద నీటి సహజ ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడితే పరిసర కాలనీలు జలమయం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఇది వరద కాలువా? లేక మురికి కాలువా? అనే అంశాన్ని అధికారులు వెంటనే స్పష్టం చేసి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో జరిగిన అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సంగారెడ్డి పట్టణంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు, అక్రమ సెల్లార్లు, అదనపు అంతస్తులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# రైతులకు చేరువలో పత్తి విత్తనాలు

మొదటి పేజీ తరువాయి...



కపస్ కాంతి పథకంలో భాగంగా 19 ప్రముఖ కంపెనీలకు చెందిన లక్ష 65 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయని, అలాగే వీటితోపాటు సస్యరక్షణ మందులైన వేప నూనె, సూక్ష్మ పోషకాలు ,జీవ నియంత్రణ ఎరువులు కూడా రైతులకు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు .రెండున్నర ఎకరాలు కలిగిన రైతుకు 5 పత్తి విత్తనాల పాకెట్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ప్రస్తుతం ఎల్ నినో కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పప్పు దినుసులు, చిరుధాన్యాలు పండించాలని, వరిలో సన్న రకాల వైపు రైతులు వెళ్లాల్సిన అవసరం ఉందని, వ్యవసాయ అధికారులు కూడా రైతులను సన్నాల వైపు ప్రోత్సహించాలని కోరారు. యూరియా స్థానంలో నానో యూరియా వాడాలని ,నానో యూరియా ఉపయోగాలను రైతులకు తెలియజేసి వాటిని వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

కాగా కపస్ కాంతి పథకంలో భాగంగా జిల్లాలో 19 ప్రముఖ కంపెనీలకు చెందిన లక్ష 65 వేల పత్తి విత్తనాల పాకెట్ల ద్వారా అధిక దిగుబడులు సాధించే ఉద్దేశ్యంతో , ఇదివరకు పత్తి సాగులో ఉన్న లోపాలను సవరిస్తూ ఎకరాకు కనీసం 750 కిలోల దిగుబడిని సాధించే విధంగా ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండున్నర ఎకరాలకు 5 పాకెట్లు అధిక సాంద్రత కలిగి దగ్గరగా పత్తి విత్తనాలు వేసే రైతులకు 10 పాకెట్లు, ఆ పై 15 ప్యాకెట్లను ఇచ్చే విధంగా రూపొందించడం జరిగింది. ఇందుకు సంబంధించి రైతులు పత్తి విత్తనాలు, యాజమాన్య పద్ధతులు వాటిలోని మెలకువలను పాటించి లబ్ధి పొందాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇచ్చే సూచనలు తెలుసుకోవాలని,ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పత్తి విత్తనాల పంపిణీ వివరాలను అన్ని రైతు వేదికల వద్ద వ్యవసాయ కార్యాలయాల వద్ద రైతులకు అర్థమయ్యే విధంగా ఫ్లెక్సీ ద్వారా ప్రదర్శించాలని, ఉదయం నుండి సాయంత్రం వరకు విత్తనాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వ్యవసాయ అధికారులతో రైతులు చర్చించాలని కలెక్టర్ సూచించారు.




నకిరేకల్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి, కట్టంగూరు తహసిల్దార్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని బిఎల్ఓలను ఆదేశించారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకే జిల్లా మహాసభ !

### భారీ ఎత్తున నిర్వహణకు కమిటీల ఏర్పాటు



**సంగారెడ్డి, అక్షిత ప్రతినిధి :** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను ఈనెల 9వ తేదీన భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి , జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. మహాసభ ఏర్పాట్లకు సంబంధించి గురువారం సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా పైసల్ మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నామని అన్నారు. చాలామంది అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇంకా రాలేదని, హెల్త్ కార్డు సమస్య ఇంకా పెండింగ్ లోనే ఉందని చెప్పారు. అదే సమయంలో ఉద్యోగ భద్రత కూడా లేకుండా పోయిందని అన్నారు. వీటన్నిటిపై చర్చించడానికి గాను 9వ తేదీన సంగారెడ్డిలో మహాసభ జరుపుతున్నామని వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పాత్రికేయులకు పదివేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నామని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లాలోని పాత్రికేయుల సమస్యల పరిష్కారమే తమ యూనియన్ లక్ష్యం అని వెల్లడించారు. అంతేకాకుండా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న మధ్య తరహా పత్రికలు, ఉర్దూ పత్రికలు,కేబుల్ టీవీ, ఫోటోగ్రాఫర్లు ,వీడియో గ్రాఫర్లు దశాబ్దాలుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. వారందరికీ ఈ మహాసభ ద్వారా భరోసా కల్పించనున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలం, హెల్త్ కార్డు, అక్రిడేషన్ కార్డులను సాధించడం జరుగుతుందన్నారు. మహాసభ నిర్వహణకు ఆహ్వాన కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, వేదిక అలంకరణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణతో పాటు

జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇతర ముఖ్యులు మహాసభకు హాజరవుతున్నందున అన్ని మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రాల నుంచి పెద్ద ఎత్తున పాత్రికేయులు తరలి కావాలని కోరారు. ఈ మేరకు ఆయా ప్రాంతాలలో సమన్వయం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రంలో నేడు తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్న సంఘం తనదేనని అన్నారు. అన్ని విభాగాల జర్నలిస్టుల ఐక్యతకు పాటుపడుతూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివరించారు.

ఈ సందర్భంగా మహాసభ పోస్టర్ ను విడుదల చేశారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అనిల్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిక్, జిల్లా కోశాధికారి మసూద్, ఇతర ముఖ్యులు సిద్దన్న పాటిల్, శ్రీనాథ్ ,బసవరాజ్ , హాజీ, వెంకటరెడ్డి, మల్లేశం,బాసిత్ ,అన్వర్, మతీన్, విల్సన్, ఈశ్వర్ చవాన్, లక్ష్మణ్,సంగమేశ్వర్ , ప్రభాకర్, నజీర్,అంజయ్య, రమేష్ గౌడ్ ,వెంకటేష్, రవీందర్, సత్తార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రూ.2.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని..

### పేదల సంక్షేమంలో ఎలాంటి రాజీ లేదు..



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 53వ డివిజన్ పరిధిలోని లష్కర్ నగర్ సింగారం, గోపాల్పూర్ జంక్షన్ ప్రాంతాల్లో సుమారు రూ.2.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వాల హయాంలో ఒక్కో డివిజన్‌కు నామమాత్రంగా నిధులు కేటాయించేవారని, ప్రస్తుతం ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి కాలనీకి మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

గతంలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అందని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పెన్షన్లు, రేషన్ కార్డుల అర్హుల జాబితాలను డివిజన్ వారీగా తుది దశకు తీసుకువచ్చామని వెల్లడించారు.



బీజేపీ నాయకులు అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ పూర్తి చేయలేదని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం ఆర్థిక విధానాలపై , ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. లాభాల్లో నడిచిన సంస్థలను కూడా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత




**వలిగొండ/ అక్షిత న్యూస్:** వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన వెల్లంకి స్పందన రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 60 వేల రూపాయల చెక్కును గురువారం లబ్ధిదారు కుటుంబ సభ్యులకు గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబటి సాయికుమార్ వార్డు సభ్యులు కాడిగళ్ల రామనర్సింహ,ఇంజమూరీ శ్రీను,మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ రసూల్ నాయకులు పులిపలుపుల రాములు,గన్నెబోయిన నర్సింహ,జంగం రాములు,ఏనుగుల నర్సింహ,ఇంజమూరీ లక్ష్మణ్,ఇంజమూరి ఆంజనేయులు,జోగు వెంకటేశం,వెల్లంకి నర్సింహారెడ్డి,తాలూకా ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వి.బి.జి రామ్.జి పథకాన్ని వెంటనే రద్దు చేయాలి

### మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

### సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు ఏపీ.మల్లయ్య




**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి కేంద్ర బిజెపి ప్రభుత్వం విబిజి రాంజీ బిల్లును తీసుకు రావడాన్ని నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ సిఐటియు రైతు సంఘం ప్రజానాట్యమండలి వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు కార్యక్రమం ఉద్దేశించి సిపిఎం సీరియల్ నాయకులు ఏపీ మల్లయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు లాభం కలిగించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిపిఎం వామపక్షాల పోరాట ఫలితంగా 20 సంవత్సరాల నుండి అమలు అవుతున్నదని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలు అదనపు ఆదాయం పొందుతూ వ్యవసాయ పనులు లేని సీజన్లో ఉపాధి హామీ చట్టం ద్వారా పని చేసుకుని జీవించే పేదల నోటి కాడ బుక్క దూరం చేసే విధంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం విబిజి రాంజీ బిల్లును తీసుకొచ్చి ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకుండా కుట్ర చేసిందని అన్నారు కొత్తగా తెచ్చిన విబిజి రాంజీ బిల్లును రద్దుచేసి పాత పద్ధతిలోనే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాల్రెడ్డి కెవిపిఎస్సి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు ప్రజానాట్యమండలి కళాకారులు జగన్ వెంకటేష్ రజక సంఘం నాయకులు కృష్ణయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంతయ్య తిరుపతయ్య లింగం సామాజిక ఉద్యమ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ 'సర్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

### వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కుమార్తె డాక్టర్ గోదా రెడ్డి

**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** బీఎల్ఏలకు ప్రత్యేక అవగాహన సమావేశం డాక్టర్ గోదా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గత ఏడు రోజులుగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తున్న బీఎల్ఏలకు ఫారాలను సరైన విధంగా నింపించే విధానం, ఓటర్ల వివరాలను పొరపాట్లు లేకుండా నమోదు చేయడం, అవసరమైన సవరణలు చేసే విధానంపై ఆమె సవివరంగా సూచనలు చేశారు.




అలాగే 2002 ఓటరు జాబితాను ఆధారంగా తీసుకుని అప్పటి పోలింగ్ స్టేషన్ (బూత్) నంబర్లను ప్రస్తుత పోలింగ్ స్టేషన్ నంబర్లతో సరిపోల్చే విధానాన్ని వివరించి, ఈ ప్రక్రియలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా 4, 5, 7, 8, 9, 10 డివిజన్ల పరిధిలోని బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరికి సరైన మార్గదర్శకత్వం అందించి, ఎలాంటి లోపాలకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 4వ రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

### దీక్షలకు సంఘీభావం తెలిపిన ఉన్నతాధికారులు

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎంఓఎఐ) --ఎస్.సి.సి.ఎల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సత్తుపల్లి ఏరియాలో గురువారం నాటికి విజయవంతంగా 4వ రోజుకు చేరుకున్నాయి.దీక్షా శిబిరంలో కూర్చున్న అధికారులకు తోటి ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ..









సింగరేణి సంస్థ అభివృద్ధిలో రాత్రింబగళ్లు కష్టపడుతున్న అధికారుల పట్ల యాజమాన్యం మరియు ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు.ప్రధాన డిమాండ్లు :పిఆర్ పి(పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే)బకాయిలు, నిలిచిపోయిన పీఆర్పీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి.పే అప్‌గ్రేడేషన్:అధికారుల సుదీర్ఘకాల సమస్య అయిన పే అప్‌గ్రేడేషన్‌ను వెంటనే అమలు పరచాలి.ఈ దీక్షలు రాబోయే రోజుల్లో (జూలై 13 వరకు) నిరంతరాయంగా కొనసాగుతాయని, యాజమాన్యం స్పందించని పక్షంలో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# రాజీవ్ నగర్ కాలనీలో నూతన రేషన్ షాపు ప్రారంభించిన ఎమ్మెల్యే మట్టా



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి మున్సిపాలిటీలోని 7 వ వార్డ్ రాజీవ్ కాలనీ లో నూతన రేషన్ షాప్ 2229036 గల షాప్ ను ప్రారంభించి, లబ్ధిదారులకు స్వయంగా రేషన్ షాపులో సన్న బియ్యం అందించారు సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్ నరసింహ , సత్తుపల్లి తాహశీల్దార్,,మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, , సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు తోటసుజాలరాణి ,నసిమాషరీఫ్, హకీమ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగాదె చెన్నారావు,మున్సిపల్ ఏఈ, సీనియర్ నేత బొంతు వేణు, విరివాడ నాగ భూషణం, రాజీవ్ కాలనీ కాంగ్రెస్ నాయకులు, ప్రజలు, రేషన్ డీలర్లు,సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాన ఎప్పుడొస్తుంది..?

**వాన వస్తలేదు... కానీ గాలి వస్తుంది**

**15 రోజులు ఆయే.ఏంటి పరిస్థితి అంటున్న రైతులు**

**ఆందోళనలో రైతాంగం వేసిన విత్తనాలు దక్కేనా?**



**చిన్నంబావి,అక్షిత న్యూస్:** సాయంత్రం వేళలో చల్లగాలులు ఉదయం వేలలో మోస్తారు ఎండలు ఏంటి పరిస్థితి అని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. కాలం పోతుందని ఏం చేయాలో తోచడం లేదని రైతులు వాపోతున్నారు. గత 15 రోజుల నుండి అదనయ్యే వర్షాలు పడటం లేదు. నాలుగైదు సార్లు అదును కావాల్సిన వర్షాలు పడాల్సి ఉండగా ఇప్పటికీ ఒక్కసారి వర్షం కురిసింది. రోహిణి మృగశిర కార్తులు వెళ్లిపోగా ఆరుద్ర కార్తి కూడా వచ్చి దాదాపు పది రోజులు అవుతుంది. మొత్తంగా వర్షపాతం చూస్తే అధికంగానే నమోదయింది. కానీ విత్తనాలు వేస్తే పెరిగే విధంగా అదునయ్యే వర్షాలు నాలుగైదు సార్లు పడే అవకాశాలు ఉంటే విత్తనం బాగా మలికెత్తి సాగయ్యే అవకాశం అధిక దిగుబడి వస్తుంది. దాదాపుగా 15 రోజులుగా వర్షాలు ఆశించిన స్థాయిలో పడలేదు.

# మహిళా సమైక్య భవనం పనుల ప్రారంభోత్సవం



**త్రిపురారం అక్షిత న్యూస్:** త్రిపురారం మండలం సత్యంపహాడ్ గ్రామ పంచాయతీ నడిమి తండ లో సర్పంచ్ ఇస్లావత్ పావని హనుమంతు ఆధ్వర్యంలో మహిళా సమైక్య భవన నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి త్రిపురారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లంపల్లి జానయ్య ,మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చి రెడ్డి ,మాజీ ఎంపీపీ సలహాదారులు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను నాయకులు ప్రారంభించి ,మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడుతుదన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ,స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డీసీసీ ఉపాధ్యక్షులు మైలారు శెట్టి సైదయ్య , త్రిపురారం మహిళా అధ్యక్షురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 90.99 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్**



**గద్వాల అక్షిత న్యూస్:** గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 90.99 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు పూర్తి,సరైన వివరాలతో నింపి సంబంధిత బీఎల్వోలకు తిరిగి అందించేలా ప్రజలను చైతన్యపరచాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి,ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. జూన్ 25వ తేదీ నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు.



జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి,సెప్టెంబర్ 28 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి,వాటి పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి మంజుల,గద్వాల తహసిల్దార్ హరికృష్ణ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ జేఏసీ కల్వకుర్తి ఆధ్వర్యంలో కళాశాలల బంధు విజయవంతం



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** నేడు రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం బీసీ జేఏసీ పిలుపు మేరకు కల్వకుర్తి నియోజకవర్గం కల్వకుర్తి పట్టణంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కల్వకుర్తి ఇంటర్ కళాశాలలో మరియు డిగ్రీ కళాశాలను విజయవంతంగా బందు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు పెండింగ్ ఫీజు రియంబరర్స్మెంట్ డబ్బులు విడుదలచేయడంతో పాటు జీవో నెంబర్ :7 ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయిలు పేరుకుపోవడం వల్ల కళాశాల యజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేయడం వల్ల విద్యార్థులు పై చదువులకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దానితోపాటు చాలా వరకు విద్యార్థులు రాష్ట్రంలో ప్రభుత్వం నుండి అందే స్కాలర్షిప్ లతో చదువుకునే వారు ఉంటారు వారికి రాష్ట్రప్రభుత్వం నుంచి సమయానికి స్కాలర్షిప్లు రాక మధ్యలోనే విద్యను ఆపేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాశాఖ పైన చిత్తశుద్ధి ఉంటే కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఫీజు బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకి భరోసా నింపాలని బీసీ జేఏసీ కల్వకుర్తి డిమాండ్ చేసింది. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలను కాపాడవలసిన బాధ్యత ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను తగ్గిస్తానని చెప్పడం సరైనది కాదని, వెంటనే రాష్ట్రంలో మెగా డీఎస్సి నినిర్వహించాలి,గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యావ్యవస్థని పటిష్టం చేయాలని బీసీ జేఏసీ కల్వకుర్తి తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి అధ్యక్షులు మేకల రాజేందర్ బీసీ సంఘాల నాయకులు భాను చందర్ సురేష్ మోడీ దారమోని గణేష్ శివ సామ్రాట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గారేపల్లి సహకార సంఘంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**అక్షిత బ్యూరో, జయశంకర్ భూపాలపల్లి, (కాటారం ):** రైతులకు సకాలంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గురువారం నాడు జిల్లా కలెక్టర్, జిల్లా సహకార అధికారి, కాటారం రెవెన్యూ డివిజనల్ అధికారి, మరియు జిల్లా వ్యవసాయ అధికారి కలిసి కాటారం మండలంలో సంయుక్తంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గారేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా అధికారులు సొసైటీలో మొబైల్ యాప్ ద్వారా జరుగుతున్న యూరియా విక్రయాలను నిశితంగా పరిశీలించారు. ఈ–పోస్ యంత్రాల ద్వారా జారీ చేస్తున్న బిల్లులు, రైతుల బుకింగ్ వివరాలు, స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతులకు పారదర్శక సమాచారం అందించేందుకు ఏర్పాటు చేసిన 'స్టాక్ లభ్యత' డిస్ప్లే బోర్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులు గంటల తరబడి క్యూ లైన్లలో నిల్చునే అవసరం లేకుండా ఎరువుల పంపిణీ సాఫీగా, వేగంగా సాగుతుండటంపై ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎరువుల బుకింగ్ యాప్ పనితీరు, పంపిణీ విధానంపై అక్కడికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు కాటారం తాసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, గారేపల్లి సహకార సంఘం సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## కాటారం మండలంలో జిల్లా కలెక్టర్

# ఆకస్మిక తనిఖీలు..

**అక్షిత బ్యూరో జయశంకర్ భూపాలపల్లి (కాటారం):** జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), మరియు కాటారం రెవెన్యూ డివిజనల్ అధికారులు గురువారం కాటారం మండలంలో సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలను, అభివృద్ధి పనుల తీరును పరిశీలించేందుకు ఈ తనిఖీలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ -- పౌష్టికాహార పంపిణీ పరిశీలన అధికారుల బృందం మొదటగా అంకుశాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించింది. కేంద్రాల్లో లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార సరఫరాను, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చిన్న





పిల్లలకు అందుతున్న పూర్వ ప్రాథమిక విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర సిబ్బంది, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.

**ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సమీక్ష:**

అనంతరం అధికారులు స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, మరుగుదొడ్ల నిర్వహణ మరియు పరిశుభ్రతను పరిశీలించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను, వంట గది నిర్వహణను సమీక్షించారు.

**సహకార సంఘం పరిధిలో యూరియా నిల్వలపై ఆరా:**

రైతాంగ సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ, కాటారంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అధికారులు తనిఖీ చేశారు. రైతులకు యూరియా, ఇతర ఎరువుల పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. ప్రస్తుత ఎరువుల నిల్వలు, పంపిణీ రిజిస్టర్లను తనిఖీ చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు అందించాలని అధికారులను ఆదేశించారు.

**చిన్న కాళేశ్వరం పనులపై సమీక్ష -- పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆదేశం:**

పర్యటన అనంతరం కాటారం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అధికారులందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన ప్రజా సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా సమస్యల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలు మరింత మెరుగుపర్చాలి

**జిల్లా కలెక్టర్ హరిత...**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో వైద్య , ఆరోగ్య సేవలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ ఛాంబర్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ లతో వైద్య సేవల పై ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లాలో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, ఫార్మసిస్టు, ఏ ఎన్ ఎం పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆసుపత్రుల్లో కావాల్సిన పరికరాలు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులకు బోధన విషయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి చర్యలు తీసుకోవడంతో పాటు ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో మృత దేహాలను తరలించేందుకు పార్థీవ వాహనం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశం లో జిల్లా వైద్యాధికారి సీతారాం, వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు తక్షణమే విడుదల చేయాలి

**జేఏసీ జిల్లా అధ్యక్షులు బడితల రమేష్**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించడం తో పాటు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బడితల రమేష్ డిమాండ్ చేశారు.

గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో ఉన్న 17 వేల మందికి పైగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీ ఈ నెల కూడా అమలు కాకపోవడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు.

ఇప్పటికీ వేతనాలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణీల సంరక్షణ, శిశు ఆరోగ్యం, టీకాలు, పల్స్ పోలియో, అత్యవసర వైద్య సేవలు, అంటువ్యాధుల నియంత్రణ లాంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో పగలు-రాత్రి తేడా లేకుండా సేవలందిస్తున్నా.. ప్రతి నెల జీతాల కోసం ఎదురుచూడాల్సి రావడం సమంజసం కాదన్నారు.

మహిళా ఉద్యోగులకు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 180 రోజుల పెయిడ్ మెటర్నిటీ లీవ్స్ సౌకర్యాన్ని వెంటనే అమలు చేయాలన్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది అందరికీ ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ , లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలన్నారు.

వివాదాస్పద జీవో నెం.1195ను పునఃసమీక్షించి, వేతనాలు పెరగాల్సిన వారికి సవరించిన జీతాలు ఇచ్చి, తగ్గిన వారికి గతంలో ఉన్న పాత వేతనాలనే కొనసాగించాలని కోరారు.

# ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదు

**జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**

**రైతులకు అవసరమైన మేరకు సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి**

**యూరియా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా బుకింగ్ చేసుకుని కొనుగోలు చేస్తున్న రైతులు**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** వానాకాలం--2026 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 691.13 మెట్రిక్ టన్నులు (15,359 బస్తాలు) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 920.02 మెట్రిక్ టన్నులు (20,445 బస్తాలు) మార్క్ ఫెడ్ ఖమ్మం వద్ద 7,656.16 మెట్రిక్ టన్నులు (1,70,137 బస్తాలు) కంపెనీ గోదాముల్లో 991.51 మెట్రిక్ టన్నులు (22,034 బస్తాలు) కమీషనర్ రిజర్వ్ పూల్ (సీఆర్‌పీ)లో 6,898.05 మెట్రిక్ టన్నులు (1,53,290 బస్తాలు) నిల్వ ఉన్నాయని తెలిపారు.

2026 జూలై 2 నాటికి జిల్లాలో మొత్తం 17,156.88 మెట్రిక్ టన్నుల యూరియా (3,81,264 బస్తాలు) అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు యూరియా యాప్ ద్వారా 56,926 మంది రైతులు 1,80,738 బస్తాలను బుక్ చేసుకొని 1,60,316 బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేస్తున్నారని వివరించారు. రైతు సోదరులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రతి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని, రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సర్ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయండి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 2:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని కాలనీలు, బస్తీలు, నివాస ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరికి అవసరమైన దరఖాస్తులు, నమోదు ప్రక్రియ, సవరణల విషయంలో సహకారం అందించాలని తెలిపారు. ఎక్కడా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అలాగే కొత్తగా 18 ఏళ్లు పూర్తి చేసుకున్న యువతతో పాటు అర్హత పొందిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఆ హక్కు అందేలా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

## పంట పొలాల్లో అక్రమ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయొద్దు

### మందమర్రి ఎస్సై జి నరేష్



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** పంటలను అడవి జంతువుల నుంచి రక్షించేందుకు పొలాల చుట్టూ అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని మందమర్రి ఎస్సై జి నరేష్ హెచ్చరించారు. ఇటువంటి తీగల వల్ల ప్రజలు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.అక్రమ విద్యుత్ కనెక్షన్ల కారణంగా ప్రాణనష్టం జరిగితే సంబంధిత భూయజమాని లేదా కనెక్షన్ ఏర్పాటు చేసిన వ్యక్తిపై నేరపూరిత మానవహత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. పోలీసు, విద్యుత్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమ కనెక్షన్లు గుర్తిస్తే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తామని హెచ్చరించారు.రైతులు ప్రభుత్వం అనుమతించిన సోలార్ ఫెన్సింగ్, నైలాన్ నెట్లు వంటి సురక్షిత ప్రత్యామ్నాయాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. అక్రమ విద్యుత్ కనెక్షన్ల సమాచారం ఉంటే వెంటనే మందమర్రి పోలీస్ స్టేషన్ లేదా డయల్--100కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## తెలంగాణ స్టేట్ షిప్ మరియు గొట్ డెవలప్మెంట్ చైర్మన్ సరిత తిరుపతయ్య యాదవ్‌ని సన్మానించిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి నియోజకవర్గం కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి నివేదిక మహనీయుల జ్ఞాన యాత్ర ముగింపు సమావేశం పాల్గొనడానికి విచ్చేసిన చైర్మన్ తెలంగాణ స్టేట్ షిప్ మరియు గోట్ డెవలప్మెంట్ కో.ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ కే,సరిత తిరుపతయ్య యాదవ్ ని సన్మానించిన వెంకటపూర్ మాజీ సర్పంచ్ పయ్యావుల రమేష్ యాదవ్, అమన్ గల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యట గీత నరసింహ ముదిరాజ్ నాగర్ కర్నూల్ డిసిసి ఉప అధ్యక్షులు నాకినమొని వెంకటయ్య యాదవ్, వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ అవాంఛ నరసింహారెడ్డి ఎస్ రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు..

# సత్తుపల్లిలో 12 మంది దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

### దొంగల ముఠాలో ఒక పోలీస్ ఆర్ఎస్ఐ ,మరో పోలీస్ కానిస్టేబుల్

### నిందితుల నుండి నగదు, వాహనాలు, సెల్ ఫోన్లు స్వాధీనం

### నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్కు తరలింపు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** గత జూన్ నెల 25వ తేదీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం వైయస్సార్ కడప జిల్లా పొద్దుటూరు కు చెందిన కుర్రా గంగాధర్ రెడ్డి తనను కొంతమంది మోసం చేసారు అని సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పెషల్ టీం పోలీసులు నేరస్తులను వెతుకుతుండగా సత్తుపల్లి మండలం గంగారంలో నేరం జరిగిన స్థలంలోనే ఉన్నారనే పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి పట్టుకుని విచారించగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. గురువారం రోజు సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఎసిపి వసుంధర యాదవ్ ఐపిఎస్ వివరాలు వెల్లడించారు.మొత్తం 14 మంది నిందితులకుగాను 12 మందిని పోలీసులు అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారని ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు.నిందితులలో ఒకరు తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ ఆర్ ఎస్ ఐ, కాగా మరొకరు తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ కానిస్టేబుల్ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

అమాయకులను మోసం చేసి అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని సిమ్ లను తీసుకొని ఆ సిమ్ ల ద్వారా ఏదో ఒక నెంబర్ కు ఫోన్ చేసే వారని ఎవరైనా అమాయకులు ఫోన్ ఎత్తితే నా పేరు మహేందర్ రెడ్డి, బాలగంగాధర్, చంద్రం, చంటిబాబు అని ఒక్కొక్కరికి ఒక్కొక్క పేరు చెబుతూ తాము రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాము అని తమ అకౌంట్లో రెండు కోట్ల రూపాయలు బ్లాక్ మనీ ఉన్నదని తమకు ఇన్కమ్ టాక్స్ సమస్యలు ఉన్నాయి అని తాము అట్టి బ్లాక్ మనీని వైట్ మనీ గా మార్చాలనుకుంటున్నాము అని మీరు ఎవరైనా మాకు డబ్బులు ఇస్తే అందుకు బదులుగా ఒక్కొక్కరికి నాలుగు రెట్లు డబ్బులు ఇస్తాము అని,అట్టి డబ్బులను నగదు రూపంలో గానీ ఎకౌంటు ద్వారా గానీ ఇస్తాము అని చెప్పి మీరు మా మీద నమ్మకం ఉంచి మేము చెప్పిన చోటుకు డబ్బులు తీసుకొని వస్తే మా మనిషి మీ వద్దకు వస్తాడు అని అతనికి ఆ డబ్బులు చూపించి మీ అకౌంట్ నెంబర్ ఇస్తే మేము ఒకటికి నాలుగు రెట్లు డబ్బులు మీ అకౌంట్లో వేస్తాము అని,మీరు 10 లక్షల రూపాయలు కనుక మాకు డబ్బులు ఇస్తే మీకు 40 లక్షల రూపాయలు మీ అకౌంట్ లో వేస్తాము అని మీరు ఆ డబ్బులలో నుండి 12 లక్షల రూపాయలు తీసుకొని మాకు మీరు ఇచ్చిన 10 లక్షలు పోను మిగతా 18 లక్షలు మాకు క్యాష్ ఇవ్వండి అని వారికి ఈ విధంగా ఆకర్షించే మోసపు మాటలు చెప్పేవారని ఈ విధంగా వీరు చెప్పే మాయమాటలతో నమ్మి వచ్చే వ్యక్తులను తాము చెప్పిన చోటుకు రమ్మని వారికి నమ్మకం కలిగించేలా మాటలు చెప్పి తమ మనిషిని వారి వద్దకు పంపి చిల్డ్రన్ కరెన్సీ నోట్లు(ఫేక్ నోట్లు)ఉన్న బ్యాగును ఇచ్చి పంపేవారు అని ఇచ్చిన ఒరిజినల్ డబ్బులు తమ మనిషి లెక్కపెట్టే సమయంలో తాము ఏర్పాటు చేసిన ఒరిజినల్ మరియు నకిలీ పోలీసులు మేము ముందే ఏర్పాటు చేసుకున్న కార్లలో వెళ్లి వారిని దొంగ నోట్లు వ్యాపారం చేస్తున్నారని లేదా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అని వారిని బెదిరించి అవసరమైతే వారిని వాళ్లతో పాటు తాము ఏర్పాటు చేసుకున్న తమ మనిషిని కూడా వారికి అనుమానం రాకుండా కొట్టి వాళ్ళ దగ్గర డబ్బులు లాక్కొని వచ్చేలా ముందే పథకం వేసుకొని పెద్ద కుట్ర పన్ని డెకాయిటీలు చేస్తున్నామని తెలిపారు అన్నారు.ఈ కేసులో గంగారంలో తెలంగాణ స్పెషల్ పోలీస్ 15వ బెటాలియన్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ముళ్ళగిరి వర్ధన్, ఆర్ఎస్ఐ బేరా కేశవరావు లు కూడా ఉన్నారు అన్నారు. నిందితుల నుండి 17 లక్షల 60 వేల రూపాయల నగదు, రెండు ఇన్నోవా కార్లు, ఒక ఎర్టిగా కారు, ఒక టీవీఎస్ యాక్సెస్ స్కూటీ ,16 సెల్ ఫోన్లు, రెండు పోలీస్ యూనిఫామ్ లు ,ఒక హ్యాండ్ కప్ యూనిఫామ్ సెట్, ఒక ఆర్ఎస్ఐ యూనిఫామ్ సెట్, రెండు పోలీస్ నేమ్ వైట్ టీ షర్ట్ లు ,పోలీసు రెయిన్ కోట్లు రెండు, డమ్మీ చిల్డ్రన్ 500 రుపీస్ కరెన్సీ నోట్స్ 80 బండిళ్ళు, 100 రూపీస్ డమ్మీబండిల్స్ స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

నిందితులు ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా కలిదిండి కి చెందిన పెయింటర్ ఈద చంటిబాబు, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం తుంబూరు కు చెందిన తెలంగాణ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ ముళ్ళగిరి వర్ధన్, ఆంధ్ర ప్రదేశ్ ఏలూరు జిల్లా నరసాపురం కు చెందిన మువ్వా సత్యనారాయణ, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతపల్లి గంగారం కు చెందిన ఆర్ ఎస్ ఐ తెలంగాణ స్పెషల్ పోలీస్ 15 బెటాలియన్ బేరా కేశవరావు, ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా చింతలపూడి మండలం మల్లాయిగూడేనికి చెందిన క్యాబ్ డ్రైవర్ మారుముడి మధు, ఖమ్మం జిల్లా వేంసూరు మండలం బీరాపల్లికి చెందిన గోరంట్ల గౌతమ్,ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సదాశివపురం కు చెందిన ఆటో డ్రైవర్ కర్లపూడి నవీన్, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం తుంబూరు కు చెందిన మెకానిక్ నక్కా నాగరాజు, ఆంధ్ర ప్రదేశ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపల్లి మండలం కొండగట్టుపల్లి కి చెందిన సాగి సుబ్బరాజు, సికింద్రాబాద్ ఎ.ఎస్ రావు నగర్ కు చెందిన సెక్యూరిటీ గార్డ్ కాపా శ్రీనివాస్, ఆంధ్ర ప్రదేశ్ కర్నూలు జిల్లా శ్రీకృష్ణ నగర్ నివాసి దుడుగురు కురబ గణేష్, ఆంధ్ర ప్రదేశ్ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం రాజేంద్రనగర్ కు చెందిన ఉపేంద్ర జనార్ధన రాజు లను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. రామాంజనేయులు మరియు సిమ్ కార్డుల విక్రయదారుడు రాజు అనే ఇద్దరు నిందితులు లు పరారీలో ఉన్నారు అని పోలీసులు తెలిపారు.ఈ కేసులో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు మరియు సిబ్బంది ని ఎసిపి వసుంధర యాదవ్ అభినందించారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### పట్టణ ఎస్సై బి సుధీర్ కుమార్

**కోదాడ అక్షిత ప్రతినిధి:** కె. ఆర్. ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. విభాగం జాతీయ సేవా పథకం కోదాడ పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ”పై సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం తెలుగు లెక్చరర్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ అధికారి వేముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సభాధ్యక్షత కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య వక్త గా కోదాడ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.సుధీర్ కుమార్ పాల్గొని ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నివారణ, రవాణాలను అరికట్టడం సమాజ శ్రేయస్సుకు అత్యవసరమని, దీనిలో యువత కీలకంగా వ్యవహరించాలని, మత్తు పదార్థాలు ఉపయోగించడంతో ఆరోగ్యం క్షీణించి, మానసికంగా దృఢత్వాన్ని కోల్పోయి, ఆర్థికంగా కృంగిపోయి, నేర




ప్రవృత్తికి అలవాటు పడి సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతారని అందుకని మత్తు పదార్థాలకు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని అందరికీ ఆయన పిలుపునిచ్చారు. చిన్న వయసులో డ్రగ్స్ ఉపయోగించడం వలన వ్యసన పరులుగా మారే అవకాశం ఉందని, డ్రగ్స్ అమ్మినా, స్వీకరించినా నేరస్తులు అవుతారని అలాంటి వారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. సభ అనంతరం విద్యార్థుల చేత డ్రగ్స్ కి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తదనంతరం మత్తు పదార్థాల నివారణ పై పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ డ్రగ్ కమిటీ మెంబర్ హుస్సేన్ గౌడ్, కళాశాల డ్రగ్స్ కమిటీ మెంబర్ జి. నాగరాజు, ఆర్. పిచ్చి రెడ్డి, జి.యాదగిరి, వి.బల భీమారావు, ఆర్. రమేష్, ఎం. రత్నకుమారి, బి.రమేష్,జి. వెంకన్న,కె. రామరాజు, జి.రవి కిరణ్, కె .సతీష్, పి. తిరుమల, గోపికృష్ణ, ఇ.నరసింహారెడ్డి, ఎస్. కె .ముస్తఫా, తిరుపతయ్య, ఎస్.కె. ఆరిఫ్, కె.శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్. చంద్రశేఖర్, ఎస్. వెంకటేశ్వర చారి, టి. మమత, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగిత్యాల పట్టణంలో పాఠశాల విద్యార్థులను రవాణా చేసే వాహనాల

# డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్, ఐపిఎస్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ పి.చేతన్ నితిన్, ఐపిఎస్ మరియు డిఎస్పీ కె.పురుషోత్తం రెడ్డి సూచనల మేరకు..




ఈ రోజు జగిత్యాల జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో పాఠశాల విద్యార్థులను రవాణా చేసే ఆటో రిక్షా మరియు టాటా మ్యాజిక్ వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది ఆటో మరియు టాటా మ్యాజిక్ డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల టౌన్ పోలిస్ సీఐ పి.కరుణాకర్ సమావేశానికి వచ్చిన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా నిబంధనలు మరియు పాఠశాల విద్యార్థుల సురక్షిత రవాణాపై అవగాహన కల్పించారు. వాహనాల్లో అనుమతించిన సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, పిల్లలను ఫుట్‌బోర్డు, వాహనం తలుపు వద్ద లేదా వాహనం వెలుపల కూర్చోనివ్వరాదని, పిల్లలు సురక్షితంగా కూర్చున్న తర్వాతే వాహనాన్ని నడపాలని సూచించారు.

అదే విధంగా నిర్ణీత వేగ పరిమితులను పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, విద్యార్థులను సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే ఎక్కించడం మరియు దించడం, వాహనాల బ్రేకులు, టైర్లు, లైట్లు, ఇండికేటర్లు, హారన్ తదితరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.




డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్ వంటి అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ సంకేతాలు మరియు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని తెలిపారు. వర్షాకాలంలో, పాఠశాలల పరిసరాల్లో మరియు రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచిస్తూ, పాఠశాల విద్యార్థుల ప్రాణ భద్రతే ప్రతి డ్రైవర్ యొక్క తొలి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ బి.మల్లేష్ , ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, ఆటో రిక్షా మరియు టాటా మ్యాజిక్ డ్రైవర్లు పాల్గొన్నారు

# జైకేసారంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి

### యాదాద్రిభువనగిరి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

**చౌటుప్పల్,అక్షిత ప్రతినిధి :** జైకేసారం గ్రామంలో ప్రభుత్వ హాస్పిటల్ కొరకు 500 గజాల అందుబాటులో ఉన్నదని ప్రజల సౌకర్యార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్సీఐ సెంటర్ ను ఏర్పాటు చేయాలని యాదాద్రి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు.చౌటుప్పల్ మండలంలో తంగడపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేదని అన్నారు. జైకేసారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత ప్రజలందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా జై కేసారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగరికిష్టయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ, సిపిఎం గ్రామ కార్యదర్శి పొట్ట శ్రీనివాస్, సిపిఎం మండల కమిటీ సభ్యులు బోదాస్ వెంకటేశం, నాయకులు దొడ్డి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# దేవరకద్ర మండలం గురుకొండ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**దేవరకద్ర ,అక్షిత న్యూస్:** జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం దేవరకద్ర మండలంలోని గురుకొండ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్.) కింద కొనసాగుతున్న పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వుతున్న ఉపాధి కూలీలతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో గుంతను ఎంత లోతుగా తవ్వుతున్నారు, ఒక్కో కార్మికుడు రోజుకు ఎన్ని గుంతలు తవ్వుతున్నారు, వారికి క్రమం తప్పకుండా పని లభిస్తోందా లేదా, అనే విషయాలను వారికి అడిగి తెలుసుకున్నారు.



అలాగే కూలీలకు వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారా లేదా అనే అంశాలపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించడంతో పాటు కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎం.పి.డి.ఓ, తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో సాయి పూజిత ఎలెక్ట్రికల్ బైక్ షోరూంను సందర్శించిన సండ్ర




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలో నూతనంగా సాయి పూజిత శ్రీనివాసరావు ప్రారంభించిన సాయి పూజిత ఎలెక్ట్రికల్ బైక్ షో రూమ్‌ను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య గురువారం సందర్శించి షోరూం యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ , గ్రంథాలయ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు , సత్తుపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి మల్లూరి అంకమరాజు, మాజీ కౌన్సిలర్ చాంద్ పాషా, సత్తుపల్లి బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెదుళ్ల నాగు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే నా లక్ష్యం

### కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మహాదేవుని శ్రీనివాస్ పునర్నియామకం



**కొమురవెల్లి అక్షిత న్యూస్:** కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనను మరోసారి నియమించిన పార్టీ అధిష్ఠానానికి మహాదేవుని శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తనపై పార్టీ ఉంచిన విశ్వాసానికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానని, మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి పార్టీ అభివృద్ధికోసంఅంకితభావంతో పనిచేస్తానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సహకారంతో పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు కృషిచేస్తాననితెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి,వాటి ఫలాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తనవంతు బాధ్యతతో నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.తనను కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా 2వ సారి నియమించిన జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి,సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డికి,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ అధ్యక్షులుమహేష్ కుమార్ గౌడ్ కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు.అదేవిధంగా గత పదవీకాలంలో తనకు అండగా నిలిచి, తిరిగి అధ్యక్షుడిగా నియమితులయ్యేందుకు సహకరించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చివరిగా,కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతం,కార్యకర్తల సంక్షేమం,ప్రజాసేవే తన ప్రధాన ధ్యేయమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం కృషి చేస్తానని మహాదేవుని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# సొంతింటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**ప్రభుత్వ విప్**
**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ నగరం, ఎదిర డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను గౌరవ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియ జేస్తూ, వారి ఆనందంలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కల సాకారం కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో సొంతింటి హామీలు మాటలకే పరిమితమై, పేదల కలలు కలగానే మిగిలిపోయాయని విమర్శించారు. ఉత్తితి హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి సారథ్యంలో ఉన్న ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అర్హులైన ప్రతి పేదవారికి సొంతింటి కలను నిజం చేస్తోందని అన్నారు. నిర్మిస్తున్న ఇళ్లు కేవలం గోడల సముదాయం కాదని, అవి పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలని పేర్కొన్నారు.



తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని, దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తుందని ఆయన చెప్పారు. ప్రతి పేద కుటుంబం సంతోషంగా జీవించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో గుడిసెలు లేని గ్రామాలు నిర్మిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేద ప్రజలకు అండగా నిలిచి వారికి సేవ చేస్తుందని, కావున ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, కార్పొరేటర్ లలిత భానుచందర్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## 38 ఏళ్ల సేవకు వీడ్కోలు

**బ్రాంచ్ పోస్టుమాస్టర్**
**సహదేవ్‌రావుకు ఘన సన్మానం**



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** తిమ్మాపూర్ బ్రాంచ్ పోస్టాఫీసులో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహించిన మత్రాజ్ సహదేవరావు 38 ఏళ్ల సుదీర్ఘ సేవను విజయవంతంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందారు. శ్రీనివాస్ రావు కుమారుడైన సహదేవరావు తన సేవా కాలంలో ప్రజలకు నిబద్ధతతో పోస్టల్ సేవలు అందిస్తూ అందరి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో సహోద్యోగులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయనకు శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం యుగేందర్, సంతోష్, పీఎల్ఐ అధికారి రస్తం అలి, దేవాపూర్ ఎస్పీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొని సహదేవ్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ సంధ్యారాణి



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి సంధ్యారాణి గారు రాయపర్తి మండలంలోని తిరుమలాయపల్లి, కొండూరు గ్రామాల్లో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న నమోదు, సవరణ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం రాయపర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ కార్యక్రమంతో పాటు సాదా బైనామా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాస్ గారు, రెవెన్యూ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాసిపేట్-2 గనిని సందర్శించిన ఏరియా జీఎం రాధాకృష్ణ



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** మందమర్రి ఏరియా పరిధిలోని కాసిపేట్-2 ఇంక్లయిన్ గనిని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ గురువారం ప్రథమ షిఫ్ట్‌లో సందర్శించారు. ఈ సందర్భంగా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లి కార్మికుల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు బొగ్గు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగులు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాద రహితంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గని సర్వేయర్ తిరుపతి, అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అబ్బూరి శివ పూర్ణ పరమేశ్వరరావు జన్మదిన వేడుకలు..

**ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ..**



**మియాపూర్ అక్షిత ప్రతినిధి:** మియాపూర్ డివిజన్ కి అబ్బూరి శివపూర్ణ పరమేశ్వర రావు పుట్టినరోజు సందర్భంగా ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ వారి సతీమణి దోనేపూడి రమాదేవి కలిసి పుట్టిన రోజును ఘనంగా నిర్వహించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. అభిమానులు మధ్య భారీగా టపాసులు కాల్చి, స్వీట్స్, హాట్స్ పంపిణి చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు సుబ్బారావు, బాషా, హరి ప్రసాద్,ప్రసాద్, శేఖర్ నాయుడు, కర్ర మూర్తి, సురేంద్ర, రవి,రాంబాబు, వినోద్ చౌదరి, ఎం ఆర్ కె చౌదరి, శ్రీకాంత్, శ్రీను చౌదరి, పెద్దబాబు, కమలాకర్ రెడ్డి, తులసి, నాని, పవన్ రెడ్డి, బాలు, రాజేష్ , వరుణ్, వీరేంద్ర, గురువులు, నరసింహ, రాము, రాజశేఖర్, నరేష్, డాక్టర్ సుబ్బు, పవన్, రాజు పుట్టినరోజు సందర్భంగా మన డి ఎస్ ఆర్ కె ప్రసాద్ తో కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియ చేయడం జరిగింది. ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్, వారి సతీమణి దోనేపూడి రమాదేవి సాంప్రదాయ శాలువాతో ఆయనను సత్కరించడం గౌరవం, సద్భావనకు చిహ్నం. సందర్భంగా డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా నాకుటుంబం మరియు మా సోదరుడు అబ్బూరి శివ పూర్ణ పరమేశ్వర రావు కుటుంబం ఎంతో సంతోషంగా, అభిమానం గా, కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ ఆనందంగా వుంటున్నాము. అలాంటి మా సోదరుడు కల కాలం ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నాను అని తెలిపారు. మాది రక్త సంబంధం కాకపోయినా మా సంబంధం అంతకంటే ఎక్కువే అని ఆయన తెలిపారు.

## శ్రీ జగన్నాథ రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత న్యూస్:** కరీంనగర్ నగరంలో ఈ నెల 16వ తేదీ, గురువారం నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, కరీంనగర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ రథయాత్ర నగరంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించే మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. జులై 16వ తేదీ మధ్యాహ్నం 1 గంటలకు మహాశక్తి టెంపుల్ వద్ద ప్రారంభమయ్యే ఈ పవిత్ర రథయాత్ర వైశ్య భవన్ వరకు ఘనంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ రథయాత్రలో ఈ ఏడాది కూడా కరీంనగర్ నగరంలోని 66 డివిజన్ల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. నగర ప్రజలందరూ సకుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ జగన్నాథ స్వామివారి రథాన్ని లాగి వారి దివ్య ఆశీర్వాదాలను పొందాలని కోరారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరహరి ప్రభు జీ , కో ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం పాల్గొన్నారు.